

సర్పంచ్‌లకు.. పూర్వవైభవం



- వలంటీర్ల రాజ్యంలో చిన్న బోయిన గ్రామ పెద్ద
- నిధులు, విధులు మీవేనంటూ పంచాయతీ కమిషనర్ స్పష్టీకరణ
- ఉమ్మడి జిల్లా లోని 1172 ప్రెసిడెంట్ లకు పూర్వ వైభవం
- గ్రామ స్వపరిపాలన కు ప్రాణం పోసిన కూటమి ప్రభుత్వం

గుంటూరు సిటీ, జూలై 31 : ఒకప్పుడు గ్రామ సర్పంచ్ అంటే మకుటం లేని మహారాజు. ఊర్లో అన్ని పనులు ఆయన చేతుల మీద గానే జరిగేవి . విద్యుత్ దీపం దగ్గర నుండి విందు, వినోదం వరకు సర్పంచ్ అన్నీతానై నిర్వహించేవారు. ఆ హోదా ఆ దర్పం ఒక రేంజ్‌లో ఉండేది. జగన్ ప్రభుత్వం స్థానిక స్వపరిపాలన సంస్థలను నిర్వీర్యం చేసింది. సర్పంచ్ అనే మాటకు అర్థాన్ని మార్చివేసింది. వలంటీర్ల రాజ్యంలో ప్రజలు ఎన్నుకున్న గ్రామ పెద్ద చిన్నబోయాడు. కేవలం ఉత్సవ విగ్రహం గానే మిగిలి పోయాడు . విధులు లేవు. నిధులు లేవు. ఏదో పేరుకే అలా పదవిలో ఉన్నారు. ఊరికి ఏదో చేద్దామన్న ఆశతో కోట్లు ఖర్చుపెట్టి మరీ కొంతమంది ఉన్నత విద్యావంతులు కూడా సర్పంచులుగా పదవులు చేపట్టారు. జగన్ ప్రభుత్వంలో అసలేమీ చేయలేమని అర్థం అయిపోయి ఎంతగానో కృంగిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ సర్పంచులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తుంది. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే మిగిలిపోయిన వారికి ప్రాణం పోసేందుకు నడుంకట్టింది. గ్రామ స్వపరిపాలన సంస్థ పూర్తిగా సర్పంచ్ కనుసనల్లోనే నడిచే విధంగా చర్యలకు ఉపక్రమించింది. ఈ పరిణామం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 మంది సర్పంచులకు ఆనందాన్ని కలిగిస్తున్నది . గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519,బాపట్ల జిల్లా లో 426 మంది సర్పంచులకు ఇది ఆనందం కలిగించే విషయం.

పంచాయతీ సొమ్ము పక్కదారి

జగన్ ప్రభుత్వం సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చటమే కాకుండా ,పంచాయతీ నిధులను పక్కదారి పట్టించింది.గడచిన ఐదేళ్ల కాలంలో గ్రామీణ ప్రాంతాలకు కొద్ది పాటి నిధు లు కూడా విదల్చలేదు.కేంద్రం ఇచ్చిన 15 ఆర్థిక సంఘం నిధులు రూ .42 కోట్ల ను పక్కదారి పట్టించింది. చాలా మంది సర్పంచ్‌లు కరోనా సమయంలో అప్పులు చేసి మరీ పారి శుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వాటిని కూ డా ప్రభుత్వం విడుదల చేయలేదు. కరెంటు బిల్లులు చెల్లించేందుకు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేం దుకు సర్పంచ్‌లు తలలు పట్టుకోవాలిసిన పరిస్థితిని కలిగించింది.

అసలు సర్పంచు అంటే ఎవరు ...

సర్పంచి అంటే అధికారులకు, గ్రామీణ సమాజానికి మధ్య వారధి లాంటి వారు.స్థానిక స్వపరిపాలన సంస్థ భారత రాజ్యాంగ బద్దంగా రూపుదిద్దుకున్న చట్టబద్ధత కలిగిన సంస్థ. గ్రామానికి సర్పంచి ప్రథమ పౌరుడు. అక్కడ ఆయన చెప్పిందే వేదం. అంతటి ప్రాధాన్యం , చట్టబద్ధత కలిగిన పదవిని జగన్ తీసుకువచ్చిన సచివాలయ సమాంతర వ్యవస్థ పూచిక పుల్లతో సమానంగా చేసింది. సచివాలయం ఏర్పడి వలంటీర్లు వచ్చాక ప్రజలకు సర్పంచ్‌తో పెద్దగా పనిలేకుండా పోయింది. గ్రామ కార్యదర్శి, వలంటీర్లు ఊరిలో నిర్ణయాత్మక శక్తిగా మారిపోయారు. ఏదో ఉన్నారంటే వున్నారు అన్న విధంగా ఆ పదవిని దిగదార్చారు.


బాధలన్నీ పోయినట్లే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తో సర్పంచ్ లు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్ష లో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులను పాత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్న విషయాన్ని అధి కారులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఆ విషయం పై దృష్టి సారించాలని ఆయ న ఆదేశించటంతో నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేసేందు కు రంగం సిద్ధం చేస్తున్నారు.

సర్పంచ్‌లతో కమిషనర్ భేటీ

ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ రాష్ట్రంలోని సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో తమ ఇబ్బందులను సర్పంచుల సంక్షేమ సంఘం నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇక మీదట గ్రామాల్లో అన్ని కార్యక్రమాలు కేవలం సర్పంచి చేతుల మీద గానే జరుగుతాయని డైరెక్టర్ హామీ ఇచ్చారు. నిధులు, విధులు అన్నీ మీవే అని స్పష్టం చేశారు. స్థానిక స్వపరిపాలన చట్టానికి లోబడి సర్పంచి పూర్వ వైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిన 5 వ ఆర్థిక సంఘం కూడా ఏర్పాటు చేసి నిధులు విడుదల చేస్తామని చెప్పటం తో సర్పంచు ల్లో ఆనందం వెల్లువెత్తుతుంది.

తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం..



గత ప్రభుత్వం వల్ల గ్రామానికి ఏమి చేయలేక తలదిం చుకొనే పరిస్థితి. ఇప్పుడు మాకు భరోసా వచ్చింది. ఊరికి ఏదో ఒకటి చేసే అవకాశం వచ్చింది. ఇంక తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం.మా విధులు నిర్వర్తించి ఊరికి ఉపకారిగా మారుతాం. పంచాయతీలకు, సర్పంచులకు పూర్వ వైభవం వచ్చినట్లే.

- చిలకలపూడి పాపారావు
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం

మా ఊరు.. మేము..



మాకు ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఏదో ఒకటి చేస్తామని. ఐదేళ్ల ఏమి చేయలేదు. కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగా మాత్రమే ఉన్నాం .ఇప్పుడు మా ఊరికి మేలు చేసే అవకాశం ఉంటుంది.

- పూల నాగమణి,మేడికొండూరు పంచాయతీ సర్పంచ్



సర్వం సిద్ధం

- పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- 7.78 లక్షల మందికి రూ.316.84 కోట్లు విడుదల
- లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియ నూరుశాతం పూర్తి
- ఈ నెలలోనూ సచివాలయ సిబ్బంది ద్వారానే పంపిణీ
- కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

అవ్వాతాతలు.. దివ్యాంగులకు గురువారం ఉదయం ఆరు గంటలకే పింఛన్ అందచేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. గత నెలలో ఎదురైన సమస్యలు ఈ సారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మూడు రోజుల ముందుగానే నగదును ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారుల ప్రక్రియను సచివాలయ సిబ్బంది బుధవారం సాయంత్రానికే నూరు శాతం పూర్తి చేశారు. గురువారం తెల్లవారగానే లబ్ధిదారుల ఇంటికెళ్లి సచివాలయ సిబ్బంది నగదు అందచేయనున్నారు. సర్వర్ సమస్య రాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు.

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధమయింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7 లక్షల మందికి పింఛన్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులే ఈసారి కూడా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయను న్నారు. గురువారం ఉదయం 6 గంటలకే పింఛను పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు జిల్లాల్లోని 7.78 లక్షల మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.316.84 కోట్లు ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమయ్యా యి. మూడు రోజుల ముందుగానే నగదు జమ కావడంతో బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని ఉద్యోగులు పంపిణీకి సిద్ధమయ్యారు.


ఉదయం 6 గంటల నుంచే..

పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 6 గంటలకల్లా ప్రారంభం కావాలని అధికారులు ఇప్పటికే సచివాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. గత నెల ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్రమాన్ని లాంఛ నంగా ప్రారంభించడంతో పంపిణీ కొంచెం ఆలస్యమైం దని, ఈసారి అలాంటి జాప్యం జరగడానికి వీలులేదని అధికారులకు తేల్చి చెప్పారు. గత నెలలో తలెత్తిన సర్వర్ సమస్యలు కూడా రాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. ఒక్కో సచివాలయ ఉద్యోగి 50 నుంచి 100 మందికి పింఛన్లు ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కిందటి నెలలో వచ్చిన చిన్నపాటి సమస్యలు కూడా రాకుండా ముందుగానే లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న 7లక్షల 78 వేల మంది లబ్ధిదారులకు ఒక్కరోజులోనే పింఛన్ అందజేయాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. గుంటూరు జిల్లాలో సాధారణ పింఛనుదారులు 2 లక్షల 58 వేల 768 మంది ఉండగా, దివ్యాంగులు 2,802 మంది ఉన్నారు. వారికి రూ.110.69 కోట్ల నిధులు విడుదలయ్యాయి. పల్నాడు జిల్లాలో 2 లక్షల 79 వేల 975 మంది సాధారణ పింఛనుదారులు, 3వేల మంది దివ్యాంగులకు రూ.112 కోట్లు విడుదలయ్యాయి. బాపట్ల జిల్లాలో సాధారణ పింఛనుదారులు 2 లక్షల 33వేల 102 మంది, దివ్యాంగులు 2,300 మంది ఉండ గా వారికి రూ.94 కోట్లు విడుదల య్యాయి. మొత్తంగా మూడు జిల్లాల్లో 7లక్షల 78 వేల మందికి రూ.316.84 కోట్లు విడుదలయ్యాయి.

పాల్గొననున్న ప్రజా ప్రతినిధులు

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. వారి ద్వారానే లబ్ధిదారులకు పింఛను అందజేయనున్నారు. ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా వాటిని వాయిదా వేసుకుని విధిగా ప్రతి నెలా పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

బియ్యంతో సరి



- రెండో నెలలోనూ రేషన్ అంతే
- కార్డుదారులకు కందిపప్పు పంచదార లేనట్లే
- ప్రైవేట్ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూ.లక్షల విలువైన వాహనం.. ఓ డ్రైవర్, ఓ సహాయకుడు.. సైరన్ మోగించుకుంటూ వచ్చి ఇచ్చేది.. బియ్యం మాత్రమే. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అంటూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యంతో సరిపెట్టింది. కూటమి ప్రభుత్వంలోనూ ఇదే పంథా రెండు నెలలుగా కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీని నిలిపివేశారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే రేషన్‌లో కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని సరఫరా చేస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూశారు. అయితే జూలైలో మాదిరిగానే ఆగస్టులో కూడా కందిపప్పు పంపిణీ జరగదని తెలిసి పేదలు ఉసూరుమంటున్నారు. అక్కడక్కడ ఏదో కొంతమందికి మాత్రం గత నెలలో సరఫరా జరిగినట్లు తెలుస్తోంది. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ఉంది. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ.67 ఇవ్వాల్సి ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో కిలోకు రూ.100 నుంచి రూ.110 వరకు అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాయితీ పై కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కందిపప్పు, పంచదార పంపిణీని ప్రభుత్వం దాదాపుగా నిలిపివేసింది. పల్నాడు జిల్లాలో 6,45,110 తెల్ల కార్డులు ఉన్నాయి. ఒక్కోక్క కార్డుదారునికి కనీసం కిలో కందిపప్పు అందజేయాలి. అయితే 1.35 శాతం కార్డుదారుల కు మాత్రమే సరఫరా చేసినట్టు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయలేదు. ఏడు ప్యాకెట్లు మాత్రమే అందజేయడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డుదారులెవ్వరికూ కూడా కందిపప్పు సరఫరా కాలేదు.

బ్లాక్ మార్కెట్‌కు
రేషన్ తరలకుండా నిఘా

అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు

నరసరావుపేట రూరల్, జూలై 31: ప్రజా పంపిణీ సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా నిఘా పెట్టాలని అధికారులను కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డా.బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాలులో బుధవారం జిల్లా అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా సరుకులు అందుతున్నాయా, సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయి స్టాక్ పాయింట్ల నుంచి దుకాణాలకు రేషన్ సరుకుల సరఫరా గురించి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలు, సంక్షేమ వసతి గృహాలకు సకాలంలో సరుకుల సరఫరాపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీవోలు రామణాకాంత్ రెడ్డి, మురళీకృష్ణ, సరోజిని, పౌరసరఫరాల శాఖ డీఎం వరలక్ష్మి, డీఎస్‌వో పద్మశ్రీ, డీఈవో వెంకటేశ్వర్లు, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు, టీడీడబ్ల్యూవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

డీఎస్పీలకు స్థానచలనం

- తొలి జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొమ్మిది మంది బదిలీ

గుంటూరు, జూలై 31: ఎట్టకేలకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భారీగా డీఎస్పీల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం 96 మందితో తొలి జాబితా విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పలువురికి స్థానచలనం కలిగింది. గత సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం డీఎస్పీలను నియమిం చుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా గత ప్రభుత్వ హయాంలో నియమితులైన వారే కొనసాగుతుండటంపై పార్టీ శ్రేణుల నుంచే కాక పోలీసు వర్గాల నుంచి కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఎట్టకేలకు డీఎస్పీల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వీవీ నాయుడు	ట్రాఫిక్, గుంటూరు	ఏసీపీ ట్రాఫిక్ , విజయవాడ
బీ జనార్ధనరావు	ఏసీపీ ట్రాఫిక్, విజయవాడ	తెనాలి
ఎం రమేష్	తెనాలి	డీజీపీ కార్యాలయం
పత్రిని శ్రీనివాసరావు	డీసీఆర్‌బీ, గుంటూరు	కాశీబుగ్గ
పీ మల్లికార్జునరావు	సీఐడీ గుంటూరు	దిశ, ఉమెన్ పీఎస్, విజయవాడ
సీహెచ్ రవికాంత్	నార్త్, గుంటూరు	డీజీపీ కార్యాలయం
ఎండీ మహబూబ్‌బాషా	సౌత్, గుంటూరు	డీజీపీ కార్యాలయం
సీహెచ్ శ్రీనివాసరావు	గురజాల	డీజీపీ కార్యాలయం
బీ ప్రసాద్	వెయిటింగ్	దిశ, ఉమెన్ పీఎస్, పల్నాడు

వరి విత్తేదెలా?



నరసరావుపేటలో వరి విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

- ఆర్బీకేలకు చేరని రాయితీ విత్తనాలు
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయం
- 5 వేల క్వింటాళ్ల అవసరమని వ్యవసాయశాఖ అంచనా
- సాగుకు సిద్ధమైన సమయంలో విత్తన కొరతతో రైతుల ఆందోళన

నరసరావుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌కు వరద పోటెత్తుతోంది. వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. జలశయాలు జలకళను సంతరించుకున్నాయి. దీంతో కుడి కాల్వ ఆయకట్టులో పంటల సాగుకు రైతుల్లో భరోసా వచ్చింది. వరి సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. అయితే సాగుకు అవసరమైన మేర విత్తనాలు అందుబాటులో లేవు. సాగుకు సిద్ధమైన తరుణంలో విత్తన సమస్య రైతులను వేధిస్తున్నది. రాయితీపై వరి విత్తనాల పంపిణీ ప్రతిపాదనలకే పరిమితమైంది. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. వరి రాయితీ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నా వారి గోడు అధికారులు ఆలకించడంలేదు. రాయితీపై విత్తనాల సరఫరాలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1,05,237 ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. విత్తనం 5 వేల క్వింటాళ్లు అవసరం ఉందని లెక్కలేశారు. ఈ స్థాయిలో రైతులకు వరి విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంది. ఎన్ఎల్ఆర్, జేజే రకాల విత్తనాలను కిలోకు రూ.5 చొప్పున ప్రభుత్వం రాయితీపై ఆర్బీకేల ద్వారా సరఫరా చేయాలి. అయితే ఈ ప్రక్రియ జిల్లాలో ఇంకా ప్రారంభం కాలేదు. 5000 క్వింటాళ్ల విత్తనాలను ఆర్బీకేలకు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ ఏపీఎస్ఎస్‌డీకి ప్రతిపాదనలు ఇచ్చింది. ఇంకా ఒక్క క్వింటా కూడా ఆర్బీకేలకు చేరలేదు. డిమాండ్ అధి కంగా ఉండటంతో వ్యాపారులు 30 కిలోల వరి విత్తనాలను రూ.1,500కు విక్రయిస్తున్నారు. కంది విత్తనాలు 1,600 క్వింటాళ్లు ఆర్‌బీకేలకు సరఫరా చేయాలని ఏపీఎస్ఎస్‌డీకి వ్యవసాయ శాఖ ఇండెంట్ ఇచ్చింది. కంది విత్తన సరఫరా అరకొరగానే ఉంది. వరి విత్తనాలను వెంటనే ఆర్బీకేలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామని వ్యవసాయ శాఖ జేడీ మురళి తెలిపారు.

సాగర్‌కు 2.67 క్యూసెక్కులు

నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. బుధవారం 2,67,684 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 312.05 టీఎంసీలు కాగా 157.42 టీఎంసీల నీటి నిల్వ చేరుకుంది. ఒక్క రోజులో సాగర్‌లో 12.87 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు గేట్లు తెరచి 2,22,768 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68,832 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 3,80,113 క్యూసెక్కుల వరద వస్తోంది. సాగర్‌కు నీటి విడుదలను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఆల్మట్టి, నారా యణపూర్, జూరాల జలాశయాల నుంచి మూడు లక్షలకుపైగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి కూడా 63,716 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రానున్న ఐదు రోజుల్లో సాగర్‌కి దాదాపు 15 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని జల వనరుల శాఖ అంచనా వేస్తోంది.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

- తొలి జాబితాలో 24 మంది సీఐలకు పోస్టింగ్స్
- 15 మందిని వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు

7లో..

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 1 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



నా దగ్గర ఆధారాలు ఉన్నాయి..
లీగల్‌గానే వెళతా

హీరో రాజ్‌తరుణ్, లావణ్యల వివాదం బుధవారం కొత్త మలుపు తిరిగింది. రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం జరిగితే అక్కడికి లావణ్య వచ్చారు. ఆ చిత్ర కథనాయిక, ఈ వివాదానికి కేంద్ర బిందువు అయిన మాల్వీ మల్హోత్రా కూడా వచ్చారు. రాజ్‌తరుణ్, మాల్వీ ఇద్దరూ వైట్ డ్రస్‌లో ఉండడం గమనార్హం. రాజ్‌తరుణ్ వస్తున్నాడని తెలియగానే మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'నా సినిమా హిట్ అయినప్పుడు కూడా ఇంత మంది మీడియా సభ్యులు రాలేదు' అంటూ రాజ్‌తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనపై వచ్చిన వివాదం గురించి ఆ మీడియా సమావేశంలో రాజ్‌తరుణ్ చెప్పిన మాటలు ఇవి.


- నాలో ఉన్న అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అందుకే లీగల్‌గా వెళుతున్నాను.
- నా వల్ల గర్భం వచ్చిందనీ, అబార్షన్ చేయించానని ఆరోపిస్తున్నారు. మరి ఆ విషయాన్ని పోలీసులకు ఇచ్చిన కంప్లయింట్‌లో ఎందుకు చేర్చలేదు? ఎందుకంటే అవి నిజాలు కావు కనుక. అందుకే ఈ విషయం గురించి నేను మాట్లాడను. మా లాయర్ ద్వారా ప్రొసీడ్ అవుతున్నా.
- నాకు ఇప్పుడు 32 ఏళ్లు. ఇన్నేళ్ల జీవితంలో ఎందరో పరిచయం అయి ఉంటారు. ఎంతో మందితో సాన్నిహిత్యం ఉంది. వాళ్లలో ఎవరైనా నేను మంచి వాడిని కాదు అని చెబితే పరిశ్రమ నుంచి తప్పుకొంటా.
- నేనూ మనిషినే. బాధలు ఉండవా! ఆ బాధ వల్లే 'పురుషోత్తముడు' చిత్రం ఫంక్షన్‌కు కూడా రాలేదు. ఆ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
- నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. అది ఇప్పుడు చెబుతున్న మాట కాదు. నా పాత ఇంటర్వ్యూలు చూస్తే అది మీకు తెలుస్తుంది.
- 'తిరగబడరా సామి' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఫ్యామిలీ అంతా చూడదగ్గ సినిమా ఇదనీ, మాల్వీ మల్హోత్రా మంచి నటి అనీ, ఆమెకు ఇదే తొలి సినిమా కనుక ఆదరించండి.

లావణ్య ప్రత్యక్షం



తనకు కనిపించకుండా తిరుగుతున్న రాజ్‌తరుణ్ ప్రసాద్ ల్యాబ్‌లో ఉన్నారని తెలియగానే లావణ్య అక్కడ ప్రత్యక్షమయ్యారు. రాజ్‌తరుణ్ కలుసుకోవాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతమంది మీడియా ప్రతినిధులు ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు లావణ్యను అక్కడ నుంచి పంపించేశారు. ఆ తర్వాత ఆమె మాదాపూర్‌లోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకొని అక్కడ కూడా ఆందోళనకు దిగారు. తలుపు తీసే వరకూ అక్కడ నుంచి వెళ్లనని అన్నారు. రాజ్‌తరుణ్ అడిగిన ఆధారాలు తెచ్చినట్లు చెప్పారు.

కట్టి పడేసే కియారా



రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వాణి కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా లుక్ పోస్టర్ విడుదల చేశారు. చూపు తిప్పుకోవడం కష్టం అనేంతగా ఉన్న కియారా గ్లామర్ లుక్ అభిమానుల్ని కట్టి పడేస్తోంది.

'గద్దర్ అవార్డ్స్‌'పై కమిటీ ఏర్పాటు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిల్మ్ అవార్డ్స్ ను ఇకపై 'గద్దర్ అవార్డ్స్' పేరుతో ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై తెలుగు చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'నటుడిగా, గాయకుడిగా ఎంతో ప్రతిభ కలిగిన వ్యక్తి గద్దర్. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలనుకోవడం సముచిత నిర్ణయం. ఈ అవార్డుల విధివిధానాలు ఎలా ఉండాలో తయారు చేయడానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి ఓ కమిటీని నియమిస్తాయి. ఆ విధి విధానాలను ఎఫ్.డి.సి. ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి త్వరలో అందజేస్తాం' అని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్యామిలీ డ్రామా



కృష్ణవంశీ, మోక్ష జంటగా నటించిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమవతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఈ సినిమా నచ్చడంతో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇదనీ, కథ అనుకున్నప్పుడే కొత్త వాళ్లతో తీయాలని అనుకున్నామనీ దర్శకుడు చెప్పారు. ఈ జనరేషన్‌కు కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమను చిత్రంలో చూపించామనీ, కొత్త టాలెంట్‌తో సినిమా తీశామని నిర్మాతలు చెప్పారు.

బడ్డీనే హీరో



అల్లు శిరీష్ హీరోగా నటించిన 'బడ్డీ' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. జ్ఞానవేల్ రాజా, అధన నిర్మాతలు. శామ్ ఆంటోన్ దర్శకుడు. బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సెకండ్ హీరో. టెడ్డీ బేర్ ఫస్ట్ హీరో. టెడ్డీ చేసే యాక్షన్ సీన్లు అలరిస్తాయి' అని చెప్పారు. ఈ సినిమా విషయంలో నిర్మాత హ్యాపీగా ఉన్నారనీ, టీమ్ కూడా సంతోషంగా ఉందని దర్శకుడు చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో



నా గత చిత్రాలకు మల్లే 'శివం భజే' సినిమాలోనూ ఓ కొత్త థ్రిల్లింగ్ అంశాన్ని చూపించబోతున్నాం అని హీరో అశ్విన్ బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా అశ్విన్‌బాబు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కుటుంబ అనుబంధాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను స్పృశించాం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని బలంగా నమ్మే పాత్ర నాది. ఇందులో యాక్షన్ స్టైలిష్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

కీర్తి కామెడీ





కీర్తిసురేశ్ లీడ్‌రోల్ పోషిస్తున్న మహిళా ప్రాధాన్య చిత్రం 'రఘుతాత'. సుమన్ కుమార్ దర్శకుడు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. గడుసైన యువతి పాత్రలో కీర్తి కామెడీ పండించిన తీరు ఆకట్టుకుంది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

తుపాన్ లాంటి యాక్షన్



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బిచ్చగాడు' తర్వాత నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం యూనిట్ చాలా కష్టపడింది. విజయ్ ఆంటోని ఇందులో సరికొత్తగా కనిపిస్తారు. వినోదం,యాక్షన్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

ఏఎన్‌యూలో పలు పదవుల భర్తీ

● నియామక ఉత్తర్వులు అందజేసిన ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, జూలై 31: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లోని వివిధ స్థానాల్లో పదవులను భర్తీ చేసినట్టు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్టూడెంట్‌సెల్(ఐఎస్‌సీ) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీ. పద్మావతి (జువాలజీ), ఉమెన్స్ స్టడీస్ సెంటర్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఈ.వీ. పద్మజ (హిస్టరీ), కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ)గా ఆలపాటి శివప్రసాదరావును నియమించారు. ఈమేరకు వారికి నియామక ఉత్తర్వులను అందజేసినట్లు అందజేశారు. తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ కే.రత్నషీలామణిలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషిని శక్తివంచన లేకుండా అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఇసుక తవ్వకాలకు ముందు, తర్వాత పరిస్థితిని ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తున్న సీఎం

ఇసుక తవ్వకాలపై సీఎం సమీక్ష

● కేసులు నమోదు చేశామన్న అధికారులు

● రెవెన్యూని సైతం రికవరీ చేయాలని సీఎం ఆదేశం

గుంటూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలంలోని వీర్లపాలెంలో వైసీపీ హయాంలో ఇసుకని అక్రమంగా దోచేశారు. ప్రభుత్వ ఖజానాకు నామమాత్రంగానే నగదు జమచేసి అనుమతించిన దాని కంటే అదనంగా ప్రైవేటు ఏజెన్సీ ఇసుకని తోడేసింది. దీనిపై ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఉపగ్రహం ద్వారా చిత్రాలను సేకరించింది. అందులో లీజు ఇచ్చిన ప్రాంతం కంటే రెట్టింపు మోతాదులో ఇసుక తవ్వకాలు జరిగినట్లు స్పష్టమైంది. దీనిపై ఏమి చర్యలు తీసుకొన్నారని సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర మైనింగ్ అధికారులను బుధవారం ప్రశ్నించారు. కేవలం ఏడాది వ్యవధిలోనే వీర్లపాలెంలో లక్షల టన్నుల ఇసుకని తరలించేశారని నివేదించారు. దీని వలన రూ. కోట్ల నష్టం ప్రభుత్వ ఖజానకు వాటిల్లింది. ఈ అక్రమాలకు సంబంధించి కేసులు నమోదుచేయడమే కాకుండా, రెవెన్యూ రికవరీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో అప్పట్లో గుంటూరు జిల్లా మైనింగ్ అధికారులుగా పని చేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

గిరిజనుల సంక్షేమమే అజెండా

● నాటి ప్రభుత్వంలో నిలిచిన సేవలన్నీ త్వరలో పునరుద్ధరణ

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, జూలై 31: గిరిజనుల సంక్షేమమే తమ అజెండా అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్ తెలిపారు. బుధవారం ఆయన గుంటూరులో విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి గిరిజనుల సంక్షేమానికి బాటలు వేయడానికి ప్రణాళికలు రూపొందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజన పుత్రులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని, ఎస్టీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణ ఊసే లేకుండా గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేశారన్నారు. రోడ్లు లేక గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో డోలీలు కట్టుకుని కొండలు, గుట్టలు దాటాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారి నోచుకోని గ్రామాలకు కచ్చా రోడ్ల స్థానంలో తారు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. కొండ కోనల్లో కష్టాలతో సహవాసం చేస్తున్న గిరిజనులకు మేలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. గిరిజన పుత్రులకు ఆరోగ్య భరోసా కలిపిస్తూ 543 గిరిజన పాఠశాలలు, ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఏఎన్ఎం సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. 2014-2019 మధ్య అమలై ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఆదివాసి గర్భిణీ వసతి గృహాల పునరుద్ధరణ, గిరిజన తండాలలో డోలి మోతలు కనిపించకూడదని చంద్రబాబు ఆదేశించారన్నారు. ఎన్ని అవసరమైతే అన్ని చోట్లా ఫీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ధారూనాయక్ తెలి పారు. గిరిజన యువతను సరైన మార్గంలో నడిపించటానికి, ఉపాధి కల్పనకు యూత్ ట్రైనింగ్ సెంటర్స్‌లో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ధారునాయక్ తెలిపారు.

వైసీపీ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవ్యస్తం



చీకటీగలపాలెం గ్రామం వద్ద గుండ్లకమ్మను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, ప్రక్కనే ఎమ్మెల్యే జీవీ

● ఐదేళ్ల కాలంలో కాలవలపై తట్ట మట్టి వేయని వైనం

● రూ.18 వేల కోట్లు బిల్లులు పెండింగ్‌లో..

● గుండ్లకమ్మకు మెయిన్‌కెనాల్ నుంచీ తూము ఏర్పాటు చేస్తాం

● నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

వినుకొండ, జూలై 31: ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవస్తమైదని, అప్పటి సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రంలోని ఏ తాగు నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టలేదని, మరమ్మతుల నిమిత్తం కాలవపై కనీసం తట్ట మట్టి వేసిన పాపాన పోలేదని భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జలహారతి కార్యక్రమం నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలం రానున్న నేపథ్యంలో బుధవారం ఏర్పాట్ల పరిశీలన కోసం మంత్రి నిమ్మల శ్రీశైలం వెలుతూండగా వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు చీకటీగలపాలెం, అడ్డరోడ్డువద్ద గల గుండ్లకమ్మ నదిని పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ..

నీటి పారుదలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 45 రోజుల్లో తాను ఉత్తరాంధ్ర పెన్నా, రాయలసీమ నీటి ప్రాజెక్టులను పరిశీలించాన్నారు. ఇరిగేషన్ వ్యవస్థను మాజీ సీఎం జగన్ రెడ్డి అస్తవ్యస్తం చేసి రైతులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు సమస్యల అధికంగా ఉందని, ఐదేళ్ళ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ఖజానాపై రూ.14 లక్షలు కోట్లు అప్పులభారాన్ని మోపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్‌లో రూ.18 వేల కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అధిగమించే పనిలో ఉన్నామని తెలిపారు. పల్నాడు జిల్లా ప్రజల దాహార్తిని తీర్చాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమ దృష్టికి తీసుకు రాగా సీఎం చంద్రబాబుతో సహకారంతో కృష్ణా రివర్ బోర్డుతో చర్చించి కుడికాలవకు 5 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు విడుదల చేయించినట్లు తెలిపారు. కృష్ణాడెల్టా నీటి ప్రాధాన్యతను సమీక్షించి సాగర్ కుడి కాలువకు నీటి విడుదల కొనసాగిస్తామని తెలిపారు.

గుండ్లకమ్మకు రైట్ కెనాల్ నుంచి తూములు ఏర్పాటు చెయ్యాలి

నియోజకవర్గంలోని గుండ్లకమ్మ నదికి, ఈపూరు చెరువుకు నాగార్జున సాగర్ మెయిన్ కెనాల్‌నుంచి నీటి విడుదలపై తూముల ఏర్పాటుకు అనుమతి కల్పించాలని మంత్రి రామానాయుడును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. గతంలో కనుమల చెరువు, కంచర్ల చెరువుకు ఏవిధంగా ఎన్నెస్పీ నుంచి తూము అనుమతి ఇచ్చారో అదేవిదంగా దీనికి అనుమతివ్వాలని కోరారు. గుండ్లకమ్మ పరివాహక గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాలు, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలకు మంచినీటి పథకాలు ఉన్నాయని, వేసవి సయయంలో గుండ్లకమ్మ ఎండిపోయి తాగు నీరులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. అలానే 36 కిలో మీటర్లు ఉన్న గుండ్లకమ్మ నదిపై అక్కడక్కడ చెక్ డామ్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తప్పని సరిగి మెయిన్ కెనాల్ నుంచీ తూమ్ ఏర్పాటు చేస్తామని, అంచనాల అనంతరం గుండ్లకమ్మపై చెక్‌డ్యామ్ నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీ మండల అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు, నేతలు ముత్తినేని ఏడుకొండలు, మీసాల మురళీకృష్ణ, కర్నాటి వెంకటరెడ్డి, మద్దుకూరి రామబ్రహ్మం , పాటు నాయకులు, ఎన్నెస్పీ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆలోచనాశక్తి, సామర్థ్యాలు వృద్ధి

● గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ఉమ్మడి రాష్ట్రాల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూలై 31: క్రీడలతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి, ఇతర సామర్థ్యాలు పెంపొందుతాయని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గుంటూరు రూరల్, నల్లపాడు, లయోలా పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రీజియన్ ఐసీఎస్ఈ పాఠశాలల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ బాలికలు క్రీడల పోటీలలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. విద్యార్థి స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఎమెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ బాలికలు సామర్థ్యం కల్గిన బాస్కెట్‌బాల్ పోటీలను ఎంపిక చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రతిభకలిగిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పీ. ఆంటోని మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఉమ్మడి రాష్ట్రానికు చెందిన 45 జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. కార్యక్రమంలో లయోలా, స్టెమ్, లిటిల్ ఫ్లవర్, హోలీఫ్యామిలి (సత్తెనపల్లి) పాఠశాలల ప్రిన్సిపాల్స్ సురేష్, భరత్ రెడ్డి, ఎస్.సవేరి, విజయరాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే రామాంజనేయులు

టీడీపీ కార్యకర్తపై కత్తితో దాడి

● తృటిలో తప్పించుకున్న వైనం .. పోలీసులకు ఫిర్యాదు

మాచవరం, జూలై 31: వైసీపీకి కార్యకర్త షేక్‌మూబూవలి తనపై కత్తితో దాడచేశాడని టీడీపీకి చెందిన దరియావలి బుధ వారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తురకపాలెం గ్రామంలో వైసీపీ కార్యకర్త షేక్ మాబూవలి, అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ దరియావలిపై కత్తితో దాడికి యత్నించాడు. అయితే చాకచక్యంగా అతను తప్పించుకున్నాడు. తురకపాలెంలోవున్న వైసీపీ కార్యకర్తకు సంబంధించిన చికెన్‌స్టాల్‌ను దరియావలి మూయించాడనే నెపంతో దరియా వలిపై ఈ దాడికి పాల్పడ్డట్టు తెలిసింది. గతంలో ఇదే వైసీపీ కార్యకర్త గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై కొడవలితో దాడిచేసి చేతికి గాయం చేశాడు. గ్రామంలో చోటు చేసుకున్న ఈసంఘటనను తెలుసుకొని అతనిని పట్టుకొని మాచవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. జరిగిన సంఘటనపై షేక్ దరియావలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిరాదు మేరకు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

హైవేపై దారి దోపిడీ

● రూ. 4 లక్షలు నగదు లాక్కొని దుండగుల పరారీ

పెదకాకాని, జూలై 31 : హైవేపై కృష్ణా జిల్లా వాసి దారి దోపిడీకి గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా జి కొండూరు చెందిన పెద్ది సుబ్బారావు అనే వ్యక్తి తాను తీసుకున్న అప్పులు తీర్చే నిమిత్తం పెదకాకాని లోని తన కుమార్తె ఇంటికి వచ్చాడు. పత్తిపాడు గ్రామ సమీపంలోని కోయవారిపాలెంలో డబ్బులు ఇచ్చేందుకు పెదకాకాని నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సుబ్బారావును తక్కెళ్ళపాడు రోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఒక వ్యక్తి అడ్డగించాడు. కిందపడ్డ తన ఏటీఎం కార్డు తీసుకున్నామంటూ సుబ్బారావు గొడవ దిగి, అతని వద్ద ఉన్న రూ.4 లక్షల నగదును లాక్కుని పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని

యువకుడి ఆత్మహత్య

బొమ్మలరామారం, జూలై31: పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించటంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్ఐ అంజయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుజిల్లా రెంటచింతలకు చెందిన దావీదు 16 సంవత్సరాలుగా మల్యాల గ్రామ పరిధిలోని మామిడి తోటలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ముగ్గురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు బీటెక్, రెండో కుమారుడు డిగ్రీ చదువుతున్నారు. చిన్న కుమారుడు చంద్రశేఖర్(13) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఉదయం 8గంటలకు పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో బయలుదేరాడు. 10గంటల సమయంలో సమీపంలో ఉన్న మామిడితోటలో చెట్టుకు చంద్రశేఖర్ వేలాడుతుండటాన్ని చూసిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు కిందికి దించగా, అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 31: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం బుధవారం నాటికి 526.80 అడుగులు ఉంది. ఇది 161.96 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 5944 క్యూసెక్కులు, మొత్తం అవుట్‌ఫ్లో వాటర్‌గా 6844 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,18,622 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

2న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),జూలై 31: జిల్లా ఉపాధి కార్యాలయం (గుజ్జనగుండ్ల) ఆధ్వర్యంలో ఈనెల 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఫెయిర్ డీలర్ కాపిటల్, హెచ్1హెచ్ఆర్ సొల్యూషన్స్, క్యాప్‌స్టోర్ సర్వీసెస్ తదితర కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతవున్న వారు బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలతో ఈనెల 2న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఇతర వివరాల కోసం గుంటూరు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య విధానంలో పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరుజిల్లా విద్యాశాఖాధికారి పీ.శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 28లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపాలని సూచించారు. అడ్మిషన్ ఫీజు ఇతర వివరాల కోసం www.apopenschool.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు రాజధాని అమరావతిలో

జంగిల్ క్లియరెన్స్ టెండర్ ఓపెన్

విజయవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు రూ.36.50 కోట్ల వ్యయంతో పిలిచిన టెండర్లను గురువారం సీఆర్‌డీఏ తెరవనుంది. వాస్తవానికి ఈ నెల 25నే టెండర్లను తెరవాల్సి ఉండగా.. 29 వరకు పొడిగించారు. తర్వాత మరో రెండు రోజులు పొడిగించారు. కాంట్రాక్టర్ల సందేహాలను నివృత్తి చేసేందుకే టెండర్ల గడువును పొడిగించినట్టుగా తెలుస్తోంది. గురువారం సాయంత్రంలోపు పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది.

జనసేన కార్యకర్తపై వైసీపీ నేతల దాడి

గురజాలటౌన్, జూలై 31: జనసేన కార్యకర్తపై వైసీపీ నేతలు దాడి జరిపిన సంఘటన గురజాల పట్టణంలో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన జనసేన కార్యకర్త పొలిశెట్టి కార్తీక్ తన స్నేహితుడిని కలిసి వస్తుండగా దండివాగు బ్రిడ్జివద్ద వైసీపీ నేతలు సుమారు 8మంది అతనిపై రాడ్లతో దాడిచేశారు. ఇంతలో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో వారు పరారయ్యారు. గాయాలపాలైన కార్తీక్‌ను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు రిఫర్ చేశారు. కాగా దాడిచేసిన వైసీపీ నేతలు దాచేపల్లి మండలం కొత్తూరుకు చెందిన వారని సమాచారం. కార్తీక్ ఫిర్యాదు మేరకు జక్కా అశోక్, బొజ్జా ప్రసాద్‌తోపాటు మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



పుట్టా నాగరాజు

ప్రత్తిపాడు, జూలై 31: అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని చినకోండ్రుపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన పుట్ట నాగరాజు (40) గత ఏడాది ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అందులో మూడు ఎకరాల మిర్చి, రెండు ఎకరాల పత్తితో పాటు ఒక ఎకరంలో కూరగాయలు సాగు చేశాడు. ఈ భూమికి కౌలుతో పాటు సాగు చేయడం కోసం తన ఇంటిని తాకట్టు పెట్టి రూ.13 లక్షలు అప్పు చేశాడు. గత ఏడాది పంటలు సరిగా పండక అప్పుల్లో మునిగి పోవడం, ఇదే తరుణంలో ఈ ఏడాది రెండు ఎకరాలు సాగుకు కౌలుకు తీసుకున్నాడు. అప్పులు తీర్చలేననే మనస్థాపంతో మంగళవారం తాను కౌలుకు తీసుకున్న పొలాన్ని దున్నిస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన నాగరాజు కూల్‌డ్రింగ్‌లో పురుగుమందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో పసువులు కాసే మహిళ జాతీయ రహదారికి పక్కన ఉన్న శ్రీనాద్ ప్లాట్స్‌కి సమీపంలో ఒక వేపచెట్టు కింద మృతదేహాన్ని గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాగరాజు భార్య రాజకుమారి ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



చెక్కు అందచేస్తున్న మంత్రి మనోహర్, సర్పంచ్ రమాదేవి, ఎంపీడీవో శిల్ప తదితరులు

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

● ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు రుణాలు పంపిణీ

తెనాలి రూరల్, జూలై 31: మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి చిన్నపాటి పరిశ్రమలు స్థాపించి వివిధ వ్యాపారరంగాల్లో అగ్రగాములుగా నిలుస్తూ ఆర్థికాభ్యున్నతిని సాధించేలా కృషి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని పెదరావూరు గ్రామంలో ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు రుణాలు పంపిణీ కార్యక్రమానికి మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 38 స్వయం సహాయక సంఘ గ్రూపులకు గానూ రూ. 5 కోట్ల 37 లక్షల చెక్కును మంత్రి మనోహర్ మహిళా సంఘాల గ్రూపులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా కోలుకోలేని దెబ్బతీశాడని ఆరోపించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా మహిళా సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పనిచేస్తున్నారన్నారు. అందులో భాగంగానే మహిళల స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు అందజేస్తున్నట్లు తెలిపారు. పొదుపులో మహిళలకు మించిన వారే లేరని వచ్చిన రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలను మహిళలకు వివరించారు. గత ప్రభుత్వంలో నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటాయని కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో నాణ్యమైన కందిపప్పు, బియ్యం వంటివి ప్రత్యేక స్టాల్స్ ద్వారా సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. మధ్యాహ్నభోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే ఆహారంపై దృష్టిపెట్టామని మరి కొద్దిరోజుల్లో మరింత నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీడీవో కానూరు శిల్ప, గ్రామ కార్యదర్శి రామసుబ్బారావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, మండలంలోని సంఘాల మహిళలు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

● తొలి జాబితాలో 24 మంది సీఐలకు పోస్టింగ్స్

● 15 మందిని వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు

గుంటూరు, జూలై 31: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సీఐల బదిలీలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు బుధవారం రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేసారు. తొలి జాబితాలో 24 మందికి పోస్టింగ్స్ ఇచ్చారు. అదేవిధంగా 15 మందికి ఎటువంటి పోస్టింగ్స్ ఇవ్వకుండా రేంజ్ విఆర్‌కు పిలిచారు. ఇందులో ఒకరిద్దరి సీఐల పోస్టింగ్స్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా ఎమ్మెల్యేల సిఫార్సుల ఆధారంగా పోస్టింగ్స్ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో పలు చోట్ల పనిచేసిన వారికీ ఈ దఫా పోస్టింగ్ లభించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. వారిలో కొందరు గత ప్రభుత్వంలో తటస్థంగా చేసినప్పటికీ, కొందరు మాత్రం గత ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసినప్పటికీ వారికి ఎలా పోస్టింగ్ లభించిందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయా సీఐలు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రసన్నం చేసుకున్నప్పటికీ వారు ఎలా సిఫార్సు చేసారనేది చర్చనీయాంశంగా మారింది. బదిలీ అయిన సీఐల పేరు, ప్రస్తుత స్థానం, బదిలీ అయిన స్థానం వివరాలు..

టి విజయకృష్ణ - సీసీఎస్, ఒంగోలు - రాపూరు సర్కిల్, నెల్లూరు జిల్లా, పి సుబ్బారావు - రేంజ్ విఆర్, గుంటూరు - వెంకటాచలం సర్కిల్, నెల్లూరు జిల్లా, మారీడు శ్రీనివాసరావు - రేంజ్ విఆర్, గుంటూరు - చీరాల 1టౌన్, బాపట్ల, ఎం. విజయ్ చరణ్ - సోషల్ మీడియా, సైబర్ క్రైం, పల్నాడు - నరసరావుపేట 1 టౌన్, పల్నాడు, యు.శోభన్ బాబు - స్పెషల్ బ్రాంచ్ 2, పల్నాడు - వినుకొండ టౌన్, పల్నాడు, పసుపులేటి రామకృష్ణ - వేమూరు సర్కిల్, బాపట్ల- నరసరావుపేటరూరల్ సర్కిల్, పల్నాడు, బి.సుబ్బానాయుడు - ఎస్సీఎస్టీ సెల్,పల్నాడు - చిలకలూరిపేట సర్కిల్ , పల్నాడు, కె.వెంకట ప్రసాద్ - స్పెషల్ బ్రాంచ్ 3, గుంటూరు - అచ్చంపేట, పల్నాడు, ప్రత్తిపాటి సురేష్ - రేంజ్ విఆర్ - పెదకూరపాడు, పల్నాడు, పొలూరి శ్రీనివాస్ - సత్తెనపల్లిటౌన్, పల్నాడు - సత్తెనపల్లి రూరల్, మోర్ల్వనేని సుబ్బారావు - చీమకుర్తి (అటాచ్‌మెంట్) - చీమకుర్తి, ప్రకాశం, సీహెచ్ హజరత్తయ్య - దిశ, బాపట్ల - సింగరాయకొండ, ప్రకాశం, వై.నాగరాజు - రేంజ్ విఆర్, గుంటూరు - ఒంగోలు 1 టౌన్, ప్రకాశం, కె. అజయ్ కుమార్ - మహిళా పీఎస్, నెల్లూరు -ఒంగోలు తాలూకా, ప్రకాశం, పి.వెంకటనారాయణ - నెల్లూరు(వేదాయపాలెం) 5వ పట్టణం - కలిగిరి సర్కిల్, నెల్లూరు, ఎ. మల్లికార్జునరావు - రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల - రేపల్లె టౌన్, బాపట్ల, పి. కిరణ్ - రేంజ్ విఆర్, గుంటూరు- పట్టాభిపురం, గుంటూరు, ఎం.శేషగిరిరావు - రేంజ్ విఆర్, గుంటూరు - మార్టూరు, బాపట్ల, కాకుమాను వెంకటరావు - సీసీఎస్, గుంటూరు - సంతమాగులూరు సర్కిల్, బాపట్ల, కొంకా శ్రీనివాస్- అరండల్ పేట (అటాచ్‌మెంట్) - అరండల్‌పేట, గుంటూరు, డి.వినోద్ కుమార్ - మంగళగిరి టౌన్(అటాచ్‌మెంట్) - మంగళగిరి టౌన్, గుంటూరు, యార్లగడ్డ శ్రీనివాసరావు - మంగళగిరి రూరల్(అటాచ్‌మెంట్) - మంగళగిరిరూరల్, గుంటూరు, కె.వంశీధర్ - నల్లపాడు(అటాచ్‌మెంట్) - నల్లపాడు, గుంటూరు, చిట్టెం కోటేశ్వరరావు - సీసీఎస్, నెల్లూరు - నెల్లూరు 1 టౌన్.

రేంజ్ విఆర్‌కు పిలిచిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

పి.శేషగిరిరావు (చీరాల 1టౌన్, బాపట్ల), సి.కృష్ణారెడ్డి (నరసరావుపేట టౌన్, పలనాడు), సిరిగిరి సాంబశివరావు (వినుకొండటౌన్), కె. మల్లికార్జున (నరసరావుపేటరూరల్ సర్కిల్, పల్నాడు), పి.శ్రీనివాస రెడ్డి(చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు), కరీముల్లా షావలి(అచ్చంపేట), జి. మంగారావు (పెదకూరపాడు, పల్నాడు), ఎం.రాజేష్‌కుమార్ (సత్తెనపల్లిరూరల్), డి.రంగనాథ్ (సింగరాయకొండ, ప్రకాశం), ఎండి ఫిరోజ్ (కలిగిరి సర్కిల్ నెల్లూరు), ఎం.నజీర్ బేగ్ (రేపల్లెటౌన్, బాపట్ల), ఎస్ విజయచంద్ర (పట్టాభిపురం), ఎస్‌వి రాజశేఖర్‌రెడ్డి (మార్టూరు,బాపట్ల), కెనరసింహారావు (సంతమాగులూరు సర్కిల్, బాపట్ల), బి అశోక్‌కుమార్(నెల్లూరు 1 టౌన్, నెల్లూరు).

6న గద్దర్, చుండూరు అమరవీరుల సంస్మరణ సభలు

గుంటూరు(తూర్పు), జూలై 31: చుండూరు అమరవీరుల వర్ధంతి, ప్రజా యుద్ధం ఒక గద్దర్ ప్రథమ వర్ధంతి సభ ఆగస్టు 6వ తేదీ, సాయంత్రం 4 గంటలకు స్థానిక బ్రాడీపేట, కొరటాల భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నేతలు తెలిపారు. సభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, కవి, సాహితీ విమర్శకులు ప్రొఫెసర్ జీ.లక్ష్మీనరసయ్య, వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.శౌరయ్య, సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరావు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శిఖా సురేష్, సాదు మాల్యాద్రి, వేల్పూరి నరసింహారావు, పాగళ్ల ప్రకాష్, గంటా ప్రభుదాసు పాల్గొన్నారు.

41,608 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 43,934 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 41,608 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,806 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000	334	9000	12000
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	–	–
273	10000	11000	273	9500	10000
341	9000	16000	341	10000	15500
4884	--	–	4884	13000	14000
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600	తేజ	9000	18600
బ్యాడిగి	8500	16300	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	10000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శాసనసభ్యుడు బ్రహ్మానందరెడ్డి

క్రీడలు సమష్టితత్వాన్ని చాటుతాయి

● మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 31: క్రీడలు సమష్టితత్వాన్ని చాటుతాయని మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఇటీవల పట్టణంలో నిర్వహించిన జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో బహుమతులు అందించారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అన్వర్‌బాషా ఆధ్వర్యాన ఈ టోర్నమెంట్ జరిగింది. మొదటి బహుమతి రూ. 1,33,318లను పల్నాడు ఓవర్సీస్ జట్టు గెలుచుకోగా రెండో బహుమతి రూ.93,318 ఎస్‌ఆర్ తండా జట్టు, మూడో బహుమతి రూ. 63,318లను పెద్దారెడ్డి జట్టు, నాలుగో బహుమతి రూ. 33,318లను నరేంద్ర 11 జట్టు గెలుచుకున్నాయి. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రాజుకు రూ. 10 వేల నగదుతోపాటు బెస్ట్ బ్యాట్‌మెన్ కింద ఇంగ్లీష్ విల్లో బ్యాటు, బెస్ట్ బౌలర్‌గా కోటికి అడిడాస్ షూస్ అందించారు. విజేతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి, సయ్యద్ అన్వర్‌బాషా, జూలకంటి చిరంజీవిరెడ్డి పులుసు ప్రతాపరెడ్డి, పంగులూరి పుల్లయ్య, రామటాకీస్ జానీ, గోరంట్ల ధీరజ్, దొండపాటి శివనాగు, గోరంట్ల శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.

నేడు పాలువాయి గేట్‌కు ఎమ్మెల్యే రాక

రెంటచింతల,జూలై 31 : ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేడు పాలువాయిగేట్ గ్రామంలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన పార్టీ నేతలతో సమావేశమవుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పర్యటన ఇదే మొదటిసారి. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ప్రతి గ్రామంలోని టీడీపీ నేతలు తప్పకుండా పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

దాచేపల్లి, జూలై 31: దాచేపల్లి నగర పంచాయతీలోని వార్డుల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని దాచేపల్లి 2వ వార్డు కౌన్సిలర్ షేక్ జూలకంటి మాబున్నీషా నగర పంచాయతీ సమావేశంలో అధికారులను కోరారు. బుధవారం దాచేపల్లిలోని సచివాలయం-1లో నగర పంచాయతీ సమావేశం చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న 15వ వార్డు కౌన్సిలర్ అన్నాబత్తుని అన్నపూర్ణ మాట్లాడుతూ వార్డుల్లో కుక్కల బెడద వుండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరారు. 8వ వార్డు కౌన్సిలర్ అంబటి సుధారాణి మాట్లాడుతూ దాచేపల్లిలో జగనన్న కాలనీలో వైసీపీ నేతలు ఒకరు రెండు, మూడు ఇళ్లస్థలాలను తీసుకున్నారని ఆరోపించారు. అధికారులు నిష్పక్షపాతంగా లబ్ధిదారుల జాబితాను పరిశీలించి అక్రమాలకు పాల్పడ్డ వ్యక్తులకు ఇళ్లపట్టాలు రద్దు చేయాలన్నారు. విద్యుత్ దీపాలు వెలగడంలేదని, తాగునీరు సమస్య, పారిశుధ్య సమస్యలపై సభ్యులు ప్రశ్నించడంతో కమిషనర్ నారాయణరావు స్పందించి తక్షణమే సభ్యులు చేసిన ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ అధికారులు, సిబ్బంది

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

దాచేపల్లి, జూలై 31: మండలంలోని ముత్యాలంపాడు గ్రామ సంగం డెయిరీ పాలకేంద్రంలో బుధవారం పాల ఉత్పత్తిదారులకు బోనస్‌లు పంపిణీ చేశారు. తంగెడ గ్రామస్థులకు రూ.1,21643, ముత్యాలంపాడు రైతులకు రూ.88,542, శంకరా పురం గ్రామస్థులకు రూ.1,20,104 వెండర్ దుర్గారావుకు రూ.54,110, టి పుల్లా రావుకు రూ.40,112 బోనస్‌గా అందజేశారు. రైతులు పశుపోషణలో ఆధునిక విధానాలను అవలంబించడంతో అధిక పాల ఉత్పత్తులు సాధించవచ్చునని గురజాల సంగం డెయిరీ అధికారులు రైతులకు తెలిపారు. రైతులు డిఆర్ఎఫ్ స్కీమ్, పశువులకు ఇన్సూరెన్స్, సబ్సిడీపై దాణా, పశుగ్రాసం విత్తనాలను సరఫరా చేయనున్నట్లు గురజాల సంగం డెయిరీ మేనేజర్ ఉప్పలపాటి రంగారావు తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్లు పులుకూరి శ్రీనివాసరావు, రూట్ సూపర్‌వైజర్ షేక్ అబ్దుల్ రషీద్, ఆదర్శ రైతు మునగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠం

● క్రోసూరు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి మహమ్మద్ షాద్

క్రోసూరు, జూలై 31 : బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లి నుంచి వచ్చే పసుపు రంగు పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని క్రోసూరు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి మహమ్మద్‌షాద్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం క్రోసూరులో జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, జీవరక్షక బిందువులు అన్నారు. ముర్రు పాలు బిడ్డను అనేక రోగాల నుంచి రక్షిస్తుందని, తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంతేగాక తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ మాట్లాడుతూ తల్లి పాలతో బిడ్డలకు సంపూర్ణ మానసిక వికాసం జరుగుతుందని, మొదటి ఆరు నెలలు బిడ్డలకు తల్లిపాలు ఇవ్వటం వారి మెదడుకు పోషణ ఇస్తుందన్నారు. ఈ సదర్భంగా ప్రతి బిడ్డకు తల్లి పాలు అందేలా తల్లుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, స్టాఫ్‌నర్సు రాణి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విభజన హామీలు తక్షణమే అమలు చేయాలి

కారంపూడి, జూలై 31: రాష్ట్రానికి విభజన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదినారాయణ ఇంటి వద్ద జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్రానిదేనన్నారు. మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులపై స్పష్టత లేదన్నారు. ఈనెల 4వ తేదీన నరసరావుపేటలో జిల్లా కార్యవర్గ సమావేశం, 5న జనరల్ బాడీ విస్తృతస్థాయి సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాస రెడ్డి, మండల కార్యదర్శి షేక్ సైదా, పట్టణ కార్యదర్శి బాబురావు, రంగనాయకులు, సూరె హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా దేచవరం వెళ్ళే రహదారిలో రెయిలింగ్ లేని వంతెన

ప్రమాదకరంగా దేచవరం వంతెన

● సైడు వాల్స్ ఏర్పాటు, మరమ్మతులు చేయించాలని స్థానికుల విజ్ఞప్తి

నకరికల్లు, జూలై 31 : నరసరావుపేట నుంచి దేచవరం వెళ్ళే రహదారిలో చిలకలూరిపేట మేజరు కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వంతెనమీదుగా నిత్యం విద్యాసంస్థల వాహనాలలో విద్యార్థులు, అలాగే ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఈ వంతెనకు ఎక్కడా సైడు వాల్స్ లేవు. పాదాచారులు, వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినా కాలువలో పడే ప్రమాదం ఉంది. ఈ వంతెనపై సైడ్ వాల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి అక్కడ వంతెన ఉందన్న విషయం తెలిసేలా సూచికలను ఏర్పాటు చేయాలని, సైడ్ వాల్ ఏర్పాటు చేయాలని, మరమ్మతులను చేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే పట్టణాభివృద్ధి

● కార్యక్రమాల్లో అందరూ పాలుపంచుకోవాలి
● కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● పలు అంశాలకు కౌన్సిలర్ల ఏకగ్రీవ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 31: సత్తెనపల్లి పట్టణ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశంలో బుధవారం చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ పాలు పంచుకోవాలన్నారు. పట్టణాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. పట్టణంలోని సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిం చటం జరుగుతుందన్నారు. 30వ వార్డు కౌన్సిలర్ తురకా మేరీ గ్రేస్ మాట్లాడుతూ పట్టణంలోని వాసవి నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం అవసరం లేదని, అక్కడ గృహాలు కూడా లేవన్నారు. జన సంచారం ఉన్న చోట రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. ఎజెండాలోని 1843 అంశాలను వాయిదా వేయాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నాయకత్వంలో పట్టణం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ముందుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.

7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ మాట్లాడుతూ ఎజెండాలోని 18, 43 అంశాలను తాము వ్యతిరేకిస్తున్నామని, మిగిలిన అంశాలను ఆమోదిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా ఎజెండాలోని మిగిలిన అంశాలన్నీ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మునిసిపల్ టీడీపీ ఫ్లోర్ లీడరుగా తురకా మేరీ గ్రేస్‌ను, డిప్యూటీ ఫ్లోర్ లీడరుగా జనసేనకు చెందిన రంగిశెట్టి సుమన్‌ను ఏకగ్రీవంగా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. మొదటి సారిగా కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కన్నాను కమిషనర్ షమ్మి ఆధ్వర్యంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది, చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ, కౌన్సిలర్లు పూలమాలలు వేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానిం చారు. పురపాలక సంఘంలో పని చేస్తున్న 24 మంది రెగ్యులర్ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే కన్నా యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కోటేశ్వరరావు నాయక్, నాగుల్ మీరాన్, కౌన్సిలర్లు జానీ బాషా, కంభంపాటి అబ్రహం, కూకుట్ల లక్ష్మీ, గుజ్జర్లపూడి సతీష్, బండి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ఎస్‌ఎంసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

కారంపూడి, జూలై 31: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎంఈవోలు కాంతారావు, రవికుమార్‌లు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎంఆర్‌సీలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమై విధి విధానాలను వివరించారు. గురువారం విద్యార్థుల ఓటర్ లిస్ట్ పాఠశాలల్లో డిస్‌ప్లే చేయబడుతుందన్నారు. ఈనెల 5వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నిక జరుగుతుందన్నారు. ఎటువంటి ఇబ్బందులు, పొరపాట్లు లేకుండా ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

విద్యుత్ ట్రాన్స్‌పోర్ట్ వాహనం బోల్తా

కారంపూడి, జూలై 31: మండలంలోని చింతపల్లి, చినగార్లపాడు రహదారి పక్కన డ్రెయినేజీలో విద్యుత్ ట్రాన్స్‌పోర్ట్ వాహనం బోల్తా కొట్టిన ఘటన బుధవారం జరిగింది. రహదారి మార్గంలో మండదపు వాగు లోలెవల్ వంతెన దాటుతూండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో విద్యుత్ సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఈ వంతెన గత ప్రభుత్వంలో నీటిలో కూలిపోగా తాత్కాలిక మరమ్మతులు చేశారు. నూతన హెలెవల్ వంతెనకు మండల అధికారులు ప్రతిపాదనలు పంపారు. గతప్రభుత్వం ఐదేళ్లపాటు జాప్యం చేసింది. దీంతో రెండు గ్రామాల రాకపోకలు అతికష్టంగా జరుగుతున్నాయి. నూతన కూటమి ప్రభుత్వంలోనైనా హైలెవల్ వంతెన మంజూరు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్య రక్ష

ముప్పాళ్ళ, జూలై 31 : తల్లి పాల నుంచి బిడ్డకు అత్యుత్తమ మైన పోషకాలు లభిస్తాయని డాక్టర్ రమాదేవి అన్నారు. ముప్పాళ్ళ ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆరోగ్య కార్యకర్తలకు, అంగన్ వాడీ సిబ్బందికి ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ తల్లిపాలు పట్టడం వల్ల శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకర వ్యాధుల నుంచి కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఏ పీటర్ డామియన్, జోస్పిన్ రాణి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఆక్రమణ దారుడిపై చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి రూరల్, జూలై 31 : మండలంలోని కంకణాలపల్లిలో ఎన్‌టీఆర్ విగ్రహం ఎదురు ఉన్న ఖాళీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని, ఆక్రమణ దారుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర ప్రసాదుకు వినతి పత్రం అందజేశారు. బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఎదురు గల సర్వే నెంబరు 71-1లో సుమారు ఆరు సెంట్ల స్థలాన్ని ఎన్‌టీఆర్ విగ్రహం కోసం తమ పూర్వీకులు దానంగా ఇచ్చారని ఎం శ్రీనివాసరావు, పచ్చా సుధీర్‌లు తెలిపారు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన కంటు బ్రహ్మయ్య గత ప్రభుత్వ హయాంలో ఆక్రమించి పూరిల్లు నిర్మించుకున్నారన్నారు. ఎన్నిసార్లు చెప్పినా లెక్క చేయలేదని, అంతేగాక తమ పై దౌర్జన్యం చేస్తున్నాడని, అతని ఆక్రమణ నుంచి స్థలాన్ని విడిపించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

30 ఏళ్లుగా ఈ భూమిలోనే నివశిస్తున్నా...

తాను బీసీ కాలనీలోని పోరంబోకు స్థలంలో పూరిల్లు నిర్మించుకొని 30 సంవత్సరాలుగా నివశిస్తున్నానని కంటు బ్రహ్మయ్య తెలిపారు. తన ఇంటిలోకి వెళ్ళకుండా మట్టి తోలించారని, అదేమని అడిగితే ఎన్‌టీఆర్ విగ్రహ అభివృద్ధి కోసం అని చెపుతున్నారన్నారు. కొందరు కావాలనే తన ఇంటిని కూల్చి వేయటానికి చూస్తున్నారని బ్రహ్మయ్య ఆరోపించారు. ఇంటి విషయంలో తనకు న్యాయం జరిగే వరకు న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు.

పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం

నకరికల్లు, జూలై 31 : ఎన్‌టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ చేసేందుకు బ్యాంకుల నుంచి నిధులను డ్రా చేసినట్లు ఎంపీడీవో జయమణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకరికల్లు మండలంలో మొత్తం 9,573 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.4,14,78,500 పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీకి కేటాయించిన ఉద్యోగులు ఉదయం 6 గంటలకు సిద్ధంగా ఉండి నూరు శాతం పింఛన్ల పంపిణీకి కృషిచేయాలని జయమణి కోరారు.

రెంటచింతల : నేటి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సర్వం సిద్ధమైనట్లు ఎంపీడీవో శంకరరావు తెలిపారు. నూరు శాతం పంపిణీ చేయాలనే లక్ష్యంలో భాగంగా 273 మంది సిబ్బందికి బాధ్యతలు అప్పచెప్పామన్నారు. మొత్తం 7042 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 99 లక్షల 55 వేలు పంపిణీ చేస్తామన్నారు.

పెదకూరపాడు: మండలంలో గురువారం ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తామని ఎంపీడీవో పీ.మల్లేశ్వరి తెలిపారు. మండలంలోని 7,768 మందికి రూ.3,30,93,500 పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 122 మంది సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పింఛన్‌దారులకు నగదు పంపిణీ చేస్తారని ఆమె వివరించారు.

క్రోసూరు : మండలంలో పింఛన్‌ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో కేవీ రమణ తెలిపారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్‌ల పంపిణీ ప్రారంభ మవుతుందన్నారు. మండలంలోని 8,701 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.3,70,25,000 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



సివిల్ సప్లయిస్ గోదాములను తనిఖీ చేసిన ఆర్డీవో మురళీకృష్ణ

సివిల్ సప్లయి గోదాము తనిఖీ

సత్తెనపల్లి, జూలై 31 : పట్టణంలోని సివిల్ సప్లయి గోదామును ఆర్డీవో మురళీకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. గోదాములోని బియ్యం బస్తాలను ఆయన పరిశీలించారు. సత్తెనపల్లి పట్టణ, రూరల్, ముప్పాళ్ళ మండలాల్లోని రేషన్‌షాపులకు కేటాయించే స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. డీలర్లకు సక్రమంగా సరుకుల పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు సివిల్ సప్లయిస్ డీటీ అరుణ ఉన్నారు. గోదాముకు సంబందించిన పూర్తి వివరాలను ఆమె ఆయనకు వివరించారు

సబ్సిడీ పై వరి విత్తనాలు పంపిణీ

ముప్పాళ్ళ, జూలై 31 : మండలంలోని దమ్మాలపాడులో రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పై వరి విత్తనాలను గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు బుధవారం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారులు తెలిపే సూచనల ప్రకారం సాగు చేసి అధిక దిగుబడిని సాధించాలన్నారు. అనంతరం పలువురు కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆయన వెంట మండల జనసేన అధ్యక్షుడు శిరిగిరి పవన్ కుమార్, నాయకులు శిరిగిరి వెంకటరావు, శిరిగిరి గోపాలరావు, అత్తోట పూర్ణయ్య తదితరులు ఉన్నారు.

మండల విస్తరణ అధికారి ఉద్యోగ విరమణ

దాచేపల్లి,జూలై 31: దాచేపల్లి మండల విస్తరణ అధికారి రావూరి జోషిరాజ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా డీపీవో ఎంవీ.భాస్కర్‌రెడ్డి, డీఎల్డీవో గబ్రూనాయక్, దాచేపల్లి ఎంపీడీవో వెంకటరమణ, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జోషిరాజ్ 35 సంవత్సరాలుగా తన వృత్తిలో ఎంతో అంకితభావంతో ఉంటూ ప్రజలకు మంచి సేవలందించారని, అలాగే అధికారుల మన్ననలు పొందాడని అన్నారు. ప్రభుత్వ శాఖలో ఆయన సేవలు, కృషి నేటి యువ ఉద్యోగులకు ఆదర్శనీయమని కొనియాడారు.

సగం సర్దేశారు

● అసంపూర్తిగా రోడ్డు నిర్మాణ పనులు
● మంజూరైన నిధులలో సగం స్వాహా చేసిన వైనం
● వైసీపీ హయాంలో అడ్డగోలుగా అవినీతి



చర్లగుడిపాడు - జనార్ధనపురం రహదారి

గురజాలటౌన్, జూలై 31: గత వైసీపీ ప్రభుత్వంలో అడిగే వారెవరూ లేరని అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. రహదారి నిర్మాణానికి మంజూరైన నిధులను సంగం బొక్కేసి, మిగిలిన సగం నిధులతో సగం రహదారి నిర్మించి, మిగతా సగం నిధులను సర్దేశారు

గురజాల మండలంలోని చర్లగుడిపాడు గ్రామం నుంచి జనార్ధనపురంకు రోడ్డు నిర్మాణం కోసం 2023 మే 20న అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రూ. 98 లక్షలు మంజూరయ్యాయి. కాగా చర్లగుడిపాడు గ్రామం నుంచి జనార్ధనపురం గ్రామానికి 5 కి.మీ.లు ఉంటుంది. అయితే సగం మేర మాత్రమే రోడ్డు నిర్మాణం చేసి మిగతా వదిలేశారు. 2019 ఎన్నికల సమయంలో కాసు మహేష్‌రెడ్డి జనార్ధనపురం గ్రామ పర్యటనకు వచ్చినప్పుడు చర్లగుడిపాడు - జనార్ధనపురం రోడ్డు నిర్మాణం చేస్తానని హామీనిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లయినా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. వర్షం పడిందంటే ఆ రోడ్డు మార్గం గుండా వెళ్లాలంటే నరకంగా ఉందని అప్పట్లో ఆంధ్రజ్యోతి కథనం కూడా వెలువరించింది. దీంతో స్పందించిన ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ.98 లక్షలు నిధులు మంజూరు చేసింది. కొంత మేర రోడ్డు వేసి ఆ నిధులను వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డునిర్మాణానికి వచ్చిన నిధులు కాజేశారని, దీనిపై విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.



టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును వెలగపూడి సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలోని పలు అంశాలపై ఆయన ముఖ్యమంత్రితో చర్చించారు.
- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

ప్రజలకు అందుబాటులో ఉంటా ..

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, జూలై 31 : పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి సహకరించాలని సూచించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. వారానికి ఐదు రోజుల పాటు నియోజకవర్గంలోనే ఉండి గ్రామాల్లో పర్యటించి ప్రజలు సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. అమరావతి నుంచి బెల్లంకొండ క్రాస్ రోడ్డు వరకు త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌ల ద్వారా అన్ని గ్రామాలకు తాగు నీరు, సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

అక్రమ భూ ఒప్పందం రద్దు హర్షణీయం

సత్తెనపల్లి, జూలై 31 : పట్టణంలోని మురుగు నీటి శుద్ధి ప్లాంట్ అక్రమ భూ ఒప్పందాన్ని అధికారులు రద్దు చేయటం అభినందనీయమని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం ఈ విషయంపై అప్పటి జిల్లా కలెక్టర్ జనసేన ఫిర్యాదు చేసిందన్నారు. మురుగు నీటి శుద్ధి ప్లాంట్ పేరుతో సుమారు రూ.9 కోట్ల ప్రజాధనాన్ని అప్పటి మంత్రి అంబటి రాంబాబు, మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త చలంచర్ల సాంబశివరావు దుర్వినియోగం చేయాలని చూశారన్నారు. ఎమ్మెల్యే కన్నా చొరవతో అక్రమ భూ ఒప్పందం రద్దు కావటం అభినందనీయమన్నారు. రూ.9 కోట్ల ప్రజాధనాన్ని జనసేన పార్టీ కాపాడిందన్నారు. ఎమ్మెల్యే కన్నాకు జనసేన పార్టీ తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మురుగు నీటి శుద్ధి ప్లాంట్ కోసం కొత్తగా భూమిని అధికారులు చూడటం అభినందనీయమన్నారు.

2న షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి రూరల్, జూలై 31 : మండలంలోని గుడిపూడి జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆగస్టు 2వ తేదీ సబ్ జూనియర్ బాల బాలికల షూటింగ్ బాల్ జిల్లాజట్ల ఎంపికలు జరుగుతాయని షూటింగ్ బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ బుధవారం తెలియ జేశారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో పాటు తల్లిదండ్రుల నుంచి అంగీకారపత్రంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 8 నుంచి చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9848655755 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ

క్రోసూరు, జూలై 31 : మొక్కల పెంపకం, సంరక్షణ ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని క్రోసూరు ఎంపీడీవో కేవీ రమణ అన్నారు. గురువారం ఊటుకూరు సచివాలయ ఆవరణలో ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జలశక్తి అభియాన్ గురించి అవగాహన కల్పించారు. నీటిని పొదుపు చేసుకుంటే మానవాళికి అది జీవితాన్ని ప్రసాదిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మురుగు కాలువలను శుభ్రం చేయటం, ఎబేట్ ద్రావణాన్ని చల్లించటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

కారంపూడి, జూలై 31: మండలంలోని ఒప్పిచర్లలో ముస్లిం వీధి రహదారి గుంతలమయంగా మారింది. దీంతో బుధవారం టీడీపీ నేత పంగులూరి శ్రీనివాసరావు తనసొంత ఖర్చులతో మట్టిని తోలించి రహదారిని చదును చేయించి ఆదర్శంగా నిలిచారు. త్వరలోనే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ద్వారా నూతన రోడ్డు నిర్మాణం చేయిస్తానని తెలిపారు.



సాగర్ నీటితో నిండిన రక్షిత మంచి నీటి పథకం చెరువు

సాగర్ జలాలతో నిండుగా తాగునీటి చెరువు

సత్తెనపల్లి, జూలై 31 : పురపాలక సంఘ పరిధిలోని రక్షిత మంచి నీటి పథకం చెరువును సాగర్ నీటితో పూర్తిగా నింపటం జరిగిందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి రోజు పట్టణంలోని ప్రజలకు తాగు నీరు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు పడుతున్నాయన్నారు. గురువారం నుంచి పట్టణంలోని ప్రజలకు రోజు మంచి నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.

నీటి పొదుపు సంరక్షణ పై అవగాహన ర్యాలీ

అచ్చంపేట, జూలై 31 : మండల కేంద్రమైన అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జలశక్తి అభియాన్, నారిశక్తిచే జలశక్తి కార్యక్రమంలో భాగంగా నీటి పొదుపు, సంరక్షణ పనుల గురించి ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ కుమారి జల ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఈజీఎస్ ఏపీవో నాగశ్రీనివాస్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, భూగర్భ జలాలు పెంపొందించు కోవాలన్నారు. మొక్కలు పెంచితే ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరు మొక్కలు పెంచాలని కోరారు. నీటిని పొదుపు చేయాలని తెలిపారు. వెలుగు ఏపీఎం, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

వెల్దుర్తి, జూలై31: మండలంలోని గుడిపాటిచెరువులో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన మండ్లి రైతు బయన్న అతని భార్య మల్లమ్మ (50)లు బుధవారం తమ గృహంలో మద్యం తాగారు. కాగా మధ్యాహ్న సమయంలో చుట్టుపక్కల వారు మల్లమ్మ కోసం గృహంలో చూడగా ఆమె విగతజీవిగా పడి ఉంది. భర్త బయ్యన్న అందుబాటులో లేడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మద్యం మత్తులో మృతి చెందిందా లేక హత్య చేశారా అనేది పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. మల్లమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మూడు సెంట్ల స్థలం ప్రకటనపై హర్షం

బెల్లంకొండ, జూలై 31 : గ్రామాల్లో నిరు పేదలకు గృహ నిర్మాణం కోసం మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించటం హర్షణీయమని పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సారథ్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు గుంజా గంగారావు, ఓర్సు రాంబాబు, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, వెంకయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



మురుగు కాలువలో పూడిక తొలగింపు, ఫాగింగ్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేటలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

● వార్డులలో సమస్యలపై 300 మంది సిబ్బంది

నరసరావుపేట టౌన్, జూలై 31: నరసరావుపేటలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. రోజంతా 300మంది పారిశుధ్య సిబ్బందితో పనులను చేపట్టారు. కాల్వల్లో పూడిక తొలగింపు, యాంటీ లార్వా స్ప్రేయింగ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వయంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని ఒకటవ వార్డు నుంచి 5వ వార్డు పరిధిలో చంద్రబాబునాయుడు కాలనీ, ఐలా బజార్, నిమ్మతోట, పనసతోట, క్రిష్టియన్‌పాలెం పరిధిలో శానిటేషన్ సిబ్బందితో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దోమలపై దండయాత్ర పేరుతో వ్యాధుల నివారణకు ప్రత్యేక చొరవ చూపారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి ఆ పథకాన్ని హేళనచేసి నిలిపివేశారన్నారు. ఫలితంగా వ్యాధులు వ్యాపించి ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ కనకారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు రాజు, నాయక్, టీడీపీ నాయకులు కొట్టా కిరణ్, క్రాంతి పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు పెద్దన్నగా సీఎం చంద్రబాబు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 31: పింఛనుదారులకు పెద్దన్నగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారని, పింఛన్ల పంపిణీలో పార్టీ నాయకులు అందరూ భాగస్వామ్యం కావాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దన్నగా ప్రతి నెల 1న ఇంటి వద్దకు పింఛన్లు అందించేందుకు శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రభుత్వ అధికారులు, పార్టీల నాయకులు ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల లోపు అధికార యంత్రాంగంతో పాటు వార్డులలో వార్డు ప్రెసిడెంట్లు, పంచాయతీలలో పంచాయతీ ప్రెసిడెంట్లు ఇంటింటికి తిరిగి పింఛన్లు లబ్ధిదారులకు అందజేయాలన్నారు.

గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

రొంపిచర్ల, జూలై 31: గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని వీరవట్నం, కొనకంచివారిపాలెం గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. వీరవట్నంలో రూ.1.13 కోట్లు, కొనకంచివారిపాలెంలో రూ.3.4 కోట్ల మేర నిధులతో నిర్వహించబోయే పనులకు శంకుస్థాపన చేశారు.



కొనకంచివారిపాలెంలో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

పట్టాభిరామస్వామి దేవస్థానంలో ఆధ్యాత్మిక సేవా స్రవంతి

నరసరావుపేట టౌన్, జూలై 31: పట్టణంలోని పట్టాభి రామస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక సేవా స్రవంతి కార్యక్రమంలో భాగంగా పల్నాడు వనితా శక్తి విభాగ్ ఆధ్వర్యంలో గో మాతకు సీమంతం అనే ఉత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఇస్కాన్ టెంపుల్ శ్రీ వైష్ణవ కృపదాసు ప్రభుజీ, వారి శిష్య బృందం వేద మంత్రోచ్చరణలతో హరేకృష్ణ, హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే సంకీర్తనలతో వైభవంగా జరిగింది. విశిష్ట అథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు కొమ్మాలపాటి సోమశేఖర్ దంపతులను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు జఫ్రుల్లా, లక్ష్మీ ప్రసూన, అన్నవరపు వీరాంజనేయులు

ఉపాధ్యాయుడు సోమశేఖర్‌కు ఘన సత్కారం

వినుకొండ టౌన్, జూలై 31: పట్టణంలోని శృంగారపువనం ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం కొమ్మాలపాటి సోమశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు సయ్యద్ జఫ్రుల్లా, లక్ష్మీ ప్రసూన, ఈపూరు మండల విద్యాశాఖ అధికారి అన్నవరపు వీరాంజనేయులు, హాజరై సోమశేఖర్ దంపతులను పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సయ్యద్ జఫ్రుల్లా మాట్లాడుతూ సోమశేఖర్ మొట్టమొదటిసారిగా ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా విద్యాశాఖలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలోని హసన్నాయునిపాలెం, చీకటీగలపాలెం, వినుకొండ పట్టణం, జాషువా నగర్, కుమ్మవారిపాలెం, నడిగడ్డలో ఉపాధ్యాయుడిగా పనిచేసి. శృంగారపువనంలో ఉద్యోగవిరమణ చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని సోమశేఖర్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలతో శ్రీనివాస నర్సింగ్‌హోమ్ వైద్యులు అన్నవరపు వీరాంజనేయులు, వార్డు కౌన్సిలర్ జయరావు, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ కే.జ్యోతి రామకృష్ణ, రాధా మాధవి, శ్రీను, జాన్, వలి, కే.కొండయ్య, ఎం.నర్సయ్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలి

● శివశక్తిలీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ లీలావతి

వినుకొండ టౌన్, జూలై 31: విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని శివశక్తిలీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి సూచించారు. మండలంలోని పానకాలపాలెం ప్రాథమిక పాఠశాల్లో ప్రధాన ఉపాధ్యాయులు లింగయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోనుగుంట్ల లీలావతి పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందచేశారు. విశ్రాంత ఉపాధ్యాయడు నాగేంద్రుడు విద్యార్థులకు ఆటవస్తువులు పంపిణీ చేశారు. ఏనుగుపాలెం ప్రధానోపాధ్యాయులు ఎలాషా మాస్టర్ విద్యలో ప్రతిభచూసిన విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో దావులూరి మున్నెయ్య, రామాంజనేయులు, ఉపాధ్యాయులు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ నిందితులకు రిమాండ్

శావల్యాపురం, జూలై 31: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని శ్రీఅడవి పేరంటాలమ్మతల్లి దేవాలయంలో ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ బల్లికురవ మండలం కొత్తూరుకు చెందిన తన్నీరు నరసింహారావు, బొల్లాపల్లి మండలానికి చెందిన గోగు నరసింహారావు, వినుకొండకు చెందిన కత్తి మురళిలు దేవాలయంలో చోరీకి పాల్పడ్డట్లు దర్యాప్తులో తేలిందన్నారు. దేవాలయంలో చోరీచేసిన సీసీ కెమేరాలు, డీవీఆర్ బాక్స్ హుండీలో నగదు, బంగారు ఉంగరం, ఒకజత వెండి పట్టీలను వారివద్ద రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన నిందితులు ముగ్గురు శావల్యాపురంలోని రెస్టారెంట్ వద్దకు భోజనానికి వెళ్ళి అక్కడ నిలిపి ఉన్న పల్సర్ బైకును అపహరించారని, అదే బైకును దేవాలయంలో చోరీకి కూడా వినియోగించినట్లు గుర్తించామన్నారు. నిందితుల వద్ద ఉన్న బైకును స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐతో పాటు కానిస్టేబుళ్ళు ప్రదీప్, ఇమ్రాన్, బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులు పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



చెరువు గండిని పరిశీలించేందుకు బైక్‌పై వస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ తదితరులు

బొల్లాపల్లి, జూలై 31: రానున్న ఐదు సంవత్సరాల్లో చెరువులకు మరమ్మతులు చేయించి తాగు, సాగు నీటికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని మూగచింతలపాలెం గ్రామచెరువు కోతకు గురై నీరు వృథాగా పోతున్న విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం మూగచింతలపాలెం గ్రామానికి వచ్చారు. చెరువుకట్టకు పోయేందుకు రోడ్డు సక్రమంగా లేకపోవటంతో మోటారు సైకిల్‌పై కోతకు గురైన చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. గండిని పరిశీలించి తక్షణమే ఇరిగేషన్ అధికారులు డీఈ, ఏఈ సమక్షంలో పొక్లెయినర్ సాయంతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో చెరువులు, పంట కాలువల మరమ్మతులే మరచి పోయిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గతంలో చంద్రబాబు నాయుడు సిమెంట్ కాలువలకు నీరు వృథా కాకుండా సిమెంట్ లెవలింగ్ చేయించారని, వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడ చిన్న పనిచేసిన పాపాన పోలేదన్నారు. తాగునీటి సౌకర్యార్థం ఎన్ఎస్‌పీ కాలువ ద్వారా సింగరచెరువును నింపటం జరిగిందని, ఎన్ఎస్‌పీ కాలువ కింద ఉన్న చెరువులు మొత్తం కూడా మంచి నీటితో నింపటం జరిగిందని, గత ప్రభుత్వంలో ఏదో ఒక చెరువును మాత్రమే నింపి నీటిని వృథాగా పోనిచ్చేవారన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి రామానాయుడు చొరవతో సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడి పల్నాడు, ప్రకాశం జిల్లాలకు తాగునీటి సౌకర్యార్థం నీటిని సరఫరా చేయటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పార్టీ నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, గోవిందు నాయక్, పోకా వెంకటరావు, ఎలిశెట్టి రంగయ్య, ఇరిగేషన్ అధికారులు తదితరులు ఉన్నారు.



అమ్మవారికి సారె తీసుకు వెళ్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

అమ్మవారికి ఆషాడ మాసం సారె

రొంపిచర్ల, జూలై 31: మండల కేంద్రమైన రొంపిచర్ల వాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా ఆర్యవైశ్యులు, గ్రామస్థులు బుధవారం ఆషాడమాసం సారె సమర్పించారు. ఈ సందర్భంగా చెరువుకట్ట సెంటర్ నుంచి ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. వివిధ రకాల పూలు, ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అమ్మవారికి జరిగిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్దిరామ చంద్రరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, కొప్పు కోటయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



కొండవీటి చిన్న పుల్లారావు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి ఎస్పీ సత్కారం

నరసరావుపేట లీగల్, జూలై 31: మీసేవలు చిరస్మరణీయమని మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులతో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లాలో ఉద్యోగ విరమణ చేసిన నలుగురు పోలీస్ అధికారులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించటంతో కుటుంబ సభ్యుల సహకారం తప్పనిసరి అన్నారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన వారిలో నరసరావుపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ టి.ఫిలింకుమార్ చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ స్వర్ణలతాదేవి అచ్చంపేట ఏఎస్ఐ యోహాన్ పిడుగురాళ్ల హెడ్ కానిస్టేబుల్ కొండవీటి చిన్న పుల్లారావులు ఉన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతి రామచంద్రరాజు ఏఆర్డీఎస్పీ గాంధీరెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయం కేవీడీ రామారావు డీసీఆర్‌పీ సీఐ అశోక్‌కుమార్ వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్ కృష్ణ యువరాజ్ పల్నాడు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.మాణిక్యాలరావు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మోటార్లకు బిగించిన విద్యుత్ తీగలు చోరీ

కారుమంచి (శావల్యాపురం) జూలై 31: పొలాల్లో నీటి అవసరాల కోసం రైతులు ఏర్పాటు చేసుకొన్న మోటర్లకు అమర్చిన విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన మండలంలోని కారుమంచి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కారుమంచి నుంచి చక్రాలవాగుకు వెళ్ళే దారిలో గ్రామానికి చెందిన బొల్లా శ్రీనివాసరావు, గోపి, ఆంజనేయులు, నాగేశ్వరరావులతో పాటు మరో 20మంది రైతులు తమ పొలాల్లో బోర్లకు మోటర్లు బిగించుకొని పంటలను సాగుచేస్తున్నారు. స్విచ్ బోర్డు నుంచి బోర్లకు అమర్చిన విద్యుత్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి అపహరించారు. బుధవారం ఉదయం పొలాలకెళ్ళిన రైతులు విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పొలాలలో వరినార్లు పోసుకునే సమయంలో తీగలు చోరీ అవటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు

శావల్యాపురం, జూలై 31: బైకుపై వెళుతున్న సచివాలయ ఉద్యోగిని ఎదురుగా వేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన వినుకొండలోని ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శావల్యాపురం మండలం కొత్తలూరు సచివాలయంలో జేఎల్ఎంగా విధులు నిర్వహిస్తున్న జాజ్జం ఏడుకొండలు బైకుపై వినుకొండలోని సురేష్‌మహల్ రోడ్డులోకి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తలకు, నుదురుకు, ఎడమకాలుకి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళగా డాక్టర్లు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి

వేల్పూరు (శావల్యాపురం) జూలై 31: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాలలోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా రక్షించేందుకు అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. మండలంలోని వేల్పూరు పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దోమల నివారణకు మురికి కాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. సీనియర్ నాయకులు బొల్లా పేరయ్య, సాదినేని కృష్ణమూర్తి, యేగినాటి తిరుపతిరావు, పూరేటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కమలారంకి కళాసాహిత్య భూషణ్ అవార్డు

వినుకొండటౌన్, జూలై 31: వినుకొండకు చెందిన కవి కమలారంని కళాసాహిత్య భూషణ్ అవార్డుతో సత్కరించినట్లు సమాఖ్య అధ్యక్షుడు యోహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలిలో గుర్రం జాషువా స్మాల్ కళాపరిశత్ దుగ్గిరాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాషువా వర్ధంతి కార్యక్రమంలో ఈ అవార్డును అందించారన్నారు. ఈసందర్భంగా కమలారంను పలువురు అభినందించినట్లు తెలిపారు.

పల్నాడు దిశ డీఎస్పీగా ప్రసాద్ నియామకం

నరసరావుపేట లీగల్‌చ జూలై 31: పల్నాడు జిల్లా దిశ మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బిప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 96మంది డీఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి ఇందులో భాగంగా ఇప్పటివరకు వెయిటింగ్‌లో ఉన్న ప్రసాద్‌ను నరసరావుపేట దిశ మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



గుండ్లకమ్మ నది వద్ద స్థల పరిశీలన చేస్తున్న మైనర్ ఇరిగేషన్ అధికారులు, రైతులు

గుండ్లకమ్మ నదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి పరిశీలన

నూజెండ్ల, జూలై 31: మండలంలోని తంగిరాల సమీపంలో గుండ్లకమ్మ నదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి బుధవారం మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళీకృష్ణలు స్థల పరిశీలన చేశారు. బ్రిటీషు కాలం నుంచి తంగిరాల నీటిని నిల్వ చేసేందుకు గుండ్లకమ్మ నదిపై ప్రాజెక్టు నిర్మాణం చేయాలని డిమాండ్ దృష్ట్యా చెక్‌డ్యామ్ నిర్మాణంతో కొంతమేర నీటిని నిల్వచేసి పరిసర గ్రామాల రైతులకు తాగు,సాగు నీరు అవసరాలను తీర్చగలుగుతామని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అదనపు తరగతులు నిర్వహించాలి

● డీవైఈవో వేణుగోపాలరావు

యడ్లపాడు, జూలై 31: విద్యా సామర్థ్యాలలో వెనుకబడిన విద్యార్థులకు అదనపు సమయం కేటాయించి తరగతులను నిర్వహించాలని డీవైఈవో వేణుగోపాలరావు సూచించారు. బుధవారం మండలంలోని కొండవీడు, చెంఘీజ్‌ఖాన్‌పేట ఎంపీయూపీ పాఠశాలలను డీవైఈవో సందర్శించారు. ముందుగా కొండవీడు ఎంపీయూపీ పాఠశాలను సందర్శించి 7, 8 తరగతుల విద్యార్థులతో ముచ్చటించారు. గణితం, సైన్స్ ఇంగ్లీషు పాఠ్యాంశాలలో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులైన విద్యార్థులకు డీవైఈవో సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. పాఠశాల స్వచ్ఛ విద్యాలయంగా ఎంపిక కావడంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట ఎంపీయూపీ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో డీఐఐ ఎస్.పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండవీడు ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న డీవైఈవో వేణుగోపాలరావు

గడ్డి మందు తాగి చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

నాదెండ్ల, జూలై 31: అనారోగ్యాన్ని తాళలేక గడ్డిమందు తాగిన గణపవరం గ్రామానికి చెందిన నార్నె వినోద్ కుమార్ (30) చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెండు సంవత్సరాల క్రితం వేముల మేరితో అతనికి వివాహం జరిగింది. చిలకలూరిపేట పట్టణంలోని ఒక గ్యాస్ కంపెనీలో వినోద్ కుమార్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కొన్నాళ్ళుగా తుంటి నొప్పితో బాధపడుతున్న వినోద్ శస్త్ర చికిత్స చేయించుకున్నా నొప్పి తగ్గకపోవటంతో జూలై 26వ తేదీన గడ్డి మందు తాగాడు. గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

153మందికి కంటి వైద్య పరీక్షలు

శావల్యాపురం, జూలై 31: నర్సరావుపేట పట్టణానికి చెందిన డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శావల్యాపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో చుట్టపక్కల గ్రామాలకు చెందిన 153మంది రోగులు పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 47మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. మిగిలినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా నర్సరావుపేటలోని రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ ఆసుపత్రిలో ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తామని, వారికి రవాణా, భోజనం, వసతి సౌకర్యాలను కూడా ఉచితంగా కల్పిస్తామని డాక్టర్‌లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మహేంధర్, గ్రామనాయకులు చెరుకూరి చౌదరి, పొలడుగు ఏడుకొండలు, పత్తిపాటి కోటిలింగం తదితరులు సహకరించారు.



శావల్యాపురంలో మందులు అందజేస్తున్న గ్రామ పెద్దలు

మాలల మహాధర్నాపై కరపత్రం ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, జూలై 31: ఎస్సీల వర్గీకరణ రాజ్యాధికారానికి దూరం చేసే కుట్ర అని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ అన్నారు. బుధవారం నరరావుపేట పట్టణంలో హలో మాల ఛలో ఢిల్లీ పేరిట ఆగస్టు 9న జరిగే మాలల మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ దళిత బహుజనుల రాజ్యాధికారానికి దూరం చేస్తోందన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజశేఖర్, ఆశీర్వాదం, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మురుగు నీటి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

మేజర్ డ్రెయిన్‌లను ఆధునికీకరిస్తాం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 31: పట్టణంలో మురుగునీరు ప్రధానంగా ప్రవహించే మేజరు డ్రెయిన్‌లు రెండు జాతీయ రహదారికి ఇరువైపులా మురుగుతో పూడిపోయి నీరు ప్రవహించే పరిస్థితి లేకుండా పోయిందని, ఈ పరిస్థితిని వారంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మునిసిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జాతీయ రహదారులకు ఇరువైపులా ప్రధాన మేజర్ మురుగు కాలువలను ఆకస్మికంగా పరిశీలించారు. ఏఎంజీ ఎదురుగా కుప్పగంజి వాగులోకి ప్రవహించే కాలువను పరిశీలించి అనంతరం సాయి కార్తీక్ సినిమా హాల్ ముందు ఓగేరు వాగులోకి ప్రవహించే మేజరు మురుగు కాలువ పూడిపోయి ఉండటాన్ని పరిశీలించారు. అసిస్ట్ ఎదురుగా ఉన్న మురుగు కాలువను పరిశీలించారు. అక్కడ స్థానికులు పాముల సంచారం ఎక్కువగా ఉందని ప్రత్తిపాటికి ఫిర్యాదు చేశారు. అనంతరం గడియార స్తంభం సెంటర్ వద్ద జరుగుతున్న అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. చేపల మార్కెట్, మటన్ మార్కెట్ షాపులను, నిర్మాణం ఆగిపోయిన సదరు ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం గాంధీ పార్కును సందర్శించి పార్కును ఆధునీకరించి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుచేయాలని, గ్రీనరీ పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి పట్టణంలో మూడు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించనున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తా: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 31: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న శాఖా గ్రంథాలయం అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తానని బుధవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. గ్రంథాలయంలో షేక్ సిద్దాంతి కరిముల్లా ఏర్పాటుచేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలను, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు అందించిన రూ.10వేలు విలువగల పోటీ పరీక్షల పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిద్ధాంతి కరిముల్లా, తేళ్ళ సుబ్బారావు, చేవూరి కృష్ణమూర్తి, వార్డు కౌన్సిలర్ కొత్తకుమారి, కోటేశ్వరరావు, గ్రంథాలయ అధికారి నాగూల్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో ట్రాఫిక్ సమస్య పై ఎస్పీ సమీక్ష

చిలకలూరిపేట, జూలై 31: పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై బుధవారం పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో సమీక్షించారు. ట్రాఫిక్ క్రమద్ధీకరణకు సంబంధించి తీసుకుంటున్న చర్యల గురించి ఆయన తెలుసుకున్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. భద్రతా నియమాలు ఉల్లంఘనలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిధిలో పాఠశాలల వద్ద, హాస్టళ్ళ వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, విజుబుల్ పోలీసింగ్ ఉండాలని సూచించారు. నేరాలను అరికట్టడానికై నైట్‌బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. పోలీసు స్టేషన్‌లో మహిళా ఫిర్యాదుదారులకు ప్రత్యేక వెయిటింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాన్ని ఆయన సందర్శించారు. అక్కడ నివాసితులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చూసేందుకు ప్రజలకోరిక మేరకు పోలీసు ఔట్‌పోస్టును ఏర్పాటు చేస్తామన్నారు.

పాఠశాలలో ఆర్‌జేడీ తనిఖీ

నాదెండ్ల, జూలై 31 : మండలంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీచేశారు. ఈ ఏడాది ఎంతమంది పాఠశాలలో ప్రవేశం పొందారనే విషయంపై హెచ్‌ఎం కృష్ణానాయక్‌ను అడిగారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యాదీవెన కిట్లు అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేస్తున్న ఆర్‌జేడీ

కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో లైఫ్‌స్కిల్స్‌పై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, జూలై 31: పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో లైఫ్ స్కిల్స్‌పై బుధవారం అవగాహన సదస్సు జరిగిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. లైఫ్ స్కిల్స్ కోచ్ ఊట్ల మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు దిశా, నిర్దేశం, డిగ్రీతో పాటు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి మొదటి సెమ్ నుంచే ఏవిధమైన ప్రణాళికలు రూపొందించుకోవాలో వివరించారు. కంపెనీకి అవసరమైన నైపుణ్య శిక్షణను ఎలా పెంపొందించుకోవాలో తెలియజేశారు. ప్రిన్సిపాల్ నాతాని మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా ఉన్నతస్థితికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో టీపీవో ఎం బాలకోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి: కమిషనర్

చిలకలూరిపేట, జూలై 31: చిలకలూరిపేట పట్టణ పరిధిలో గురువారం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని మునిసిపల్ కమిషనర్ గోవిందరావు బుధవారం తెలిపారు. ఇందుకోసం బ్యాంకుల నుంచి మొత్తం రూ.4.76కోట్ల రూపాయలు నిధులను డ్రాచేసి సిద్ధం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని 29 వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న 11,191 మందికి పింఛన్లను ఉదయం 5:30 నుంచి 6గంటల మధ్య ప్రారంభిస్తామని తెలిపారు. పింఛన్ల పంపిణీని పూర్తి చేసేందుకు 216మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించినట్టు వెల్లడించారు. తొమ్మిదిమంది సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో పంపిణీ జరుగుతుందని తెలిపారు. సుమారు 78శాతం మేరకు పింఛన్ల పంపిణీ గురువారం ఒక్కరోజునే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ప్రత్యేక అధికారి బీ నారదముని ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీకి సంబంధించిన ప్రక్రియ సజావుగా సాగేందుకు సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేసినట్టు ఆయన వెల్లడించారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

చిలకలూరిపేట, జూలై 31: పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న రోటరీ భవన్‌లో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా ఆళ్ళ వేమనరెడ్డి, కార్యదర్శిగా ఉప్పుటూరి ప్రసాదు, కోశాధికారిగా కటకం శివరామ్ ప్రసాదులతో రోటరీ జిల్లా గవర్నర్ ఎలక్ట్ డాక్టర్ శివరామ్‌ప్రసాదు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీచేసి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా మాజీ గవర్నర్ జాష్టి రంగారావు, గల్లా సాంబశివరావు, తోటకూర వెంకటనారాయణ, కాపు వెంకటరావు, కొల్లా శ్రీనివాసరావు, పీ శివరంజని, కందిమళ్ళ సాంబశివరావు, దండా గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక బృందం తనిఖీ

యడ్లపాడు, జూలై 31: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను క్షేత్రస్థాయి పరిశీలనకు సామాజిక తనిఖీ బృందం బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. బృందం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ జేఎస్‌రాజు ఆధ్వర్యంలోని తనిఖీ బృందం సభ్యులు ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ విభాగాలకు సంబంధించిన రికార్డులను ఆయా విభాగాధిపతుల నుంచి సేకరించి పరిశీలన ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన, గ్రామసభలను నిర్వహించిన అనంతరం ప్రజావేదిక నిర్వహిస్తామని రిసోర్స్‌పర్సన్ రాజు తెలిపారు.